


వి. వినయమూర్తి

రెండున్నర గంటల బస్సు ప్రయాణంతో ఒళ్ళంతా ముద్దయిపోయింది. వీధిలోంచి లోపలికి అడుగుపెట్టి ఏవో నవ్వులు వినిపించడంతో బుర్ర అటువయిపు తిప్పాను. మా బావా, వరం ఒకే మంచంమీద కూర్చుని వున్నారు మండువా నానుకుని వున్న గదిలో. షాక్ తిన్నట్టు నిలబడిపోయాను. వరం నవ్వుతున్నదల్లా నేను కనపడగానే ఒక్క అంగలో గదిలోంచి బయటపడి వాళ్ళ యింటివేపు పారిపోయింది. బావ ఏం జరిగిందా అన్నట్టు ఇటువయిపు తిరిగి నన్ను చూడగానే నివ్వెరపోతూ లేచి నించున్నాడు. అంతలోనే కంగారు కప్పిపుచ్చుకుంటూ—

"రా! రా! బావా" అంటూ ఆహ్వానించాడు.

భుజాన వేలాడుతున్న బాగ్‌ను దించుకుంటూ—

"ఎప్పుడొచ్చావ్!" అన్నాను.

నా గొంతులో సౌమ్యత లేకపోవటంతో జగన్నాధం తబ్బిబ్బు పడ్డాడు.

"మొన్న వచ్చాను."

వరలక్ష్మిని గురించి ప్రశ్నించాలనుంది. కాని ఏమని ప్రశ్నించను? ఎలా?

యింతలో చెల్లాయి లలిత "వరం" అంటూ అరుచుకుంటూ వచ్చి, నన్ను చూస్తూనే కళ్ళు యింతంతచేసి "అరేయ్! అన్నయ్యా!" ఎప్పుడొచ్చావ్!" అంది. అనడమేంటి. "అమ్మా! అన్నయ్యొచ్చాడే" అంటూ అరుస్తూ లోపలకు పోడం, అమ్మను వెంటబెట్టుకు రాడం ఒకదాని వెంబడి ఒకటి జరిగిపోయాయి.

అమ్మ నా రాకకు చాలా సంతోషించింది. సహజ దోరణిలో "నీకు దయలేదనీ, పండగలక్కూడా రావటంలేదనీ" నిష్ఠూరం వేసింది. అంతల్లోనే .... "పోన్లే! యిన్నాళ్ళకయినా వచ్చావు?" అంటూ సంతృప్తి ప్రకటించింది.

యిలా ఆవిడ మాట్లాడుతుంటే ఆవిడకు అన్యమనస్కంగా జవాబిస్తున్నాను.

నాన్న ఎవరినో వెంటబెట్టుకుని వచ్చినట్టున్నాడు. "అమ్మాయ్! చాప పంపించమ్మా!" అంటూ వీధిలోంచి అరిచాడు.

లలిత చాప తీసుకువెళ్ళి తలుపు చాటునించే అందించింది. దాని గొంతు వినిపించలేదు. కానీ నాన్న గొంతు వినిపించింది "ఇప్పుడే వస్తాను! మా పెద్దాడు వచ్చాట్ట కూర్చోండి!"

"ఎప్పుడొచ్చావురా బాబీ!" నాన్న ఆప్యాయంగా పలకరించాడు.

"యిప్పుడే!"

"పరీక్షలేవో వున్నాయన్నావు మీ బాంక్‌లో! బాగా రాసావా?"

చెప్పాను. ఆయన కుశలప్రశ్నలకు మధ్యలో మా అమ్మ అడ్డుపడుతోంది .... 'చూడండీ!

పెద్రితండ్రి ఎంతెలా చిక్కిపోయాడో! యీ సారైనా పెళ్ళికి మెడలు వంచా'లంటూ....

ఆయన వీధిలోకి వెళ్ళాడు.

"కబుర్లు తరవాత చెప్పుకోవచ్చు! నాన్న గారికి పెట్టిన వేణ్ణీళ్ళు వున్నట్టున్నాయి! లలితా! తువ్వాలు యియ్యి! స్నానంచేస్తాడు."

స్నానం చేస్తున్నాను.

వెచ్చటి నీళ్ళు ఒంటిమీద పడుతుంటే ఆ చలిలో చిత్రంగా సుఖంగా వుంది. ఆ హాయిలో మనసు లగ్నం కావటం లేదు. శరం చుట్టూ బావచుట్టూ తిరుగుతోంది.

వరలక్ష్మి మా పెదనాన్న కూతురు. వాళ్ళ కుటుంబానికీ మా కుటుంబానికీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. అన్నదమ్ములిద్దరూ మాట్లాడుకోని పాతిక ఏళ్ళయిందిట.యీ మధ్య పదేళ్ళుగా చితికిపోయాడుట. కూతురికి పెళ్ళి కూడా చేయలేకపోయాడని వింటున్నాను. గ్రామ రాజకీయాల్లోకూడా ఆయన మా నాన్న కన్న కాస్త వెనకబడి పోయాడనటానికి నిదర్శనం పంచాయితీ ప్రెసిడెంటు గిరీ మా నాన్నకు దక్కటమే. అయితే మళ్ళీ ఎన్నికలలో మా పెదనాన్న గెలుస్తాడని ఒక పుకారు వుంది. ఏది ఎంతవరకూ నిజమో నాకు స్పష్టంగా తెలీదు. కాని, పిల్లలమయిన మేం ఒకరి యింటికి ఒకరు అపుడపుడు వెళ్ళటం వుంది. ముఖ్యంగా వరం యిక్కడికి వస్తుంటుంది. మా పెదనాన్న ఆరుగురు కూతుళ్ళలో అదే పెద్దది. వరమూ నా చెల్లెలు మొగుడూ ఒక మంచంమీద కూర్చోటమేంటి?

భోజనాల దగ్గర నాన్న తన మామూలు ధోరణిలో ఏవేవో మాట్లాడుతున్నాడు. బావ మొహంలో భావాలు అంతు చిక్కటంలేదు. నేనేమయినా అనవసరంగా ఆలోచిస్తున్నానా?

భోజనాలు చివరి దశకు చేరుకుంటుండగా—

"యీ వేళ వరం రాలేదేంటే....?"

ఆశ్చర్యంగా నాన్నవయిపు చూశాను. వరం రాక గూర్చి ప్రత్యేకంగా అడగటమేమిటన్నది నా ప్రశ్న. ఆ దృశ్యం నా కంట బడటం వల్ల యీ ప్రశ్న ఏర్పడిందా? ఆలోచన తెగలేదు. ఆయన ధోరణిలో ఏదో అసాధరణత నాకు అవుపిస్తోంది.

"వచ్చిందే!" అంది అమ్మ చెల్లాయి వయిపు తిరిగి.

"ఆ! వెంటనే వెళ్ళిపోయింది" లలిత జవాబిచ్చింది.

తాంబూలం నవుల్తూ నాన్న బయటకు వెళ్ళాడు. ఆయన గమ్యస్థానం చెరువు గట్టు మీద రావిచెట్టు. ఊళ్ళో పదిమందీ అక్కడకు చేరి గంటో రెండు గంటలో లోకాభిరామాయణంలో పడతారు.

"మనమూ అలా వెళ్దామా బావా!"

నా ప్రశ్నకు జవాబుగా తలూపి చెప్పులు వేసుకొన్నాడు జగన్నాధం.

ఆకాశంలో అష్టమచంద్రుడు వెన్నెల కురిపిస్తున్నాడు. మౌనంగా సిగరెట్లు కాలుస్తూ చెరువు గట్టుమీద నడుస్తున్నాం! కీచురాళ్ళ శబ్దం ఆ నిశ్శబ్దంలో చిత్రంగా వుంది. రావిచెట్టు దాటాం! ఊరు నెమ్మది నెమ్మదిగా మాకు దూరమవుతోంది.

"ఏం సినిమాలు చూసావోయ్!"

బావ ప్రశ్నకు జవాబివ్వలేక పోయాను. అడిగెయ్యాలన్న నిశ్చయం జరిగిపోయింది. ఎలా అన్నదే తెలియటంలేదు.

"యిక్కడ కూర్చుందాం!" అన్నాను.

ఒత్తుగా గడ్డి వుందక్కడ. చెరువులో అలలు చిన్న అలికిడి సృష్టిస్తున్నాయి. వందెకరాల చెరువు అది. బావ మట్టిరాళ్ళు చెరువులోకి విసురుతున్నాడు.

ఆ వెన్నెలలో అతని మొహంలో భావాలు నాకు దొరకటం లేదు.

హఠాత్తుగా నా వయిపు తిరిగాడు.

"ఏంటలా చూస్తున్నావ్?"

"ఒక విషయం అడగాలనుంది... !"

చేతిలో రాయి నేలమీద జారవిడిచాడు. మోకాళ్ళమీద తల పెట్టుకొని నేలవయిపు చూస్తూ తనలో తను గొణుక్కుంటున్నట్టు అన్నాడు.

"వరం గురించే కదూ!"

"అవును.

కొంతసేపు ఆలోచించి ఏదో భారం వది లించుకొంటున్నట్లు అన్నాడు.

"యీ విషయం మీ చెల్లాయికీ తెల్సు!"

భార్యకి ఈ విషయం తెలియటంలో అతడు ప్రత్యేకించి చెప్పవలసింది ఏమీ లేదు. కానీ అలా చెప్పటంలోనే ఏదో కొత్తదనం వుంది. నా ఊహకు అర్థంకాని కొత్తదనం!!

"అంటే....??"

"యిలాంటి విషయం ఎలా మాట్లాడాలో నాకు అర్థంకాటం లేదు బావా!" అంటూ ఆగాడు.

ఒళ్ళు పట్టని కోపం వచ్చింది. చెయ్యటానికి ఏ అభ్యంతరాలూ వుండవు కాని... చెప్పటానికే వస్తాయి అన్ని సిగ్గులూ!!తమాయించుకున్నాను. అతను నాకు బావ అయినంతమాత్రాన అతని లైంగిక జీవితంలోకి తొంగి చూడటానికి నాకు అధికారమేంటి?

"యీ విషయంగూర్చి... తెలుసుకోవాలను కుంటే మీ చెల్లాయినే అడుగు! అయామ్ టూ వీక్!" గొంతులో దిగులు!

అతడు సమర్థించుకోటం లేదు. చెయ్యనే లేదనటం లేదు.

"అదికాదు బావా!...."

నా మాటలు మధ్యలోనే ఖండిస్తూ అన్నాడు.

"దయచేసి... నన్నేం ప్రశ్నించకు బావా! ఆ క్షణంలో నాకు కలిగిన ఆనందం... ఆ తర వాత యింత దుఃఖం కలిగిస్తుందని తెలిస్తే.... యింత వ్యామోహంలో పడిపోయే వాడిని కాదేమో! మరొకరి బ్రతుకును సర్వనాశనం చేసేవాడిని కాదేమో! యింత బాధపడుతూ కూడా. . ఎందుకలా లొంగిపోతాను! నాకెందుకీ బలహీనత....!"

మనిషి సన్నగా వణుకుతున్నాడు. లోపల్లో పల వున్న దుఃఖం అతని శరీరాన్నంతనీ కుదిపి వేస్తున్నట్లుంది! ఆ పరిస్థితిలో అతన్ని నేను యిబ్బంది పెట్టలేకపోయాను.

కొంతసేపట్లో అతను తేరుకొన్నాక ఇంటి మొహం పట్టాం!

మర్నాటి సాయంకాలంగాని చెల్లాయిని ఈ విషయం అడగడానికికుదరలేదు. భార్యాభర్తలక్ష యిద్దరికీ తెలిసిన విషయమయినప్పుడు నేను కలగచేసుకోట మెందుకు అనిపించింది. కాని, బావ దుఃఖం మనసులో మెదులుతుంటే నా జోక్యం అవసరమే అన్పించింది. బావ అన్నాడేగాని చెల్లాయికి యీ విషయం తెలుసునా? దాన్ని అడిగితే ఏం బాధపడుతుందో! రకరకాల ఆలోచనలు!

పెరట్లో కొబ్బరి మొక్కల దగ్గర మంచం మీద కూర్చున్నాం!

"లల్లీ! బావ ..."

"రాత్రి చెప్పారు.అంతా నీకు చెప్పాలా... " అంది బుర్ర వంచుకొని.

కొంతసేపు అది సంశయించింది. తర్వాత స్వరంలో ఒక చిత్రమైన గర్వం తొంగి చూస్తుండగా ఆరంభించింది—అది చెప్పినదాని సారాంశం యిది.

"—అటు మొన్న మీ బావ వచ్చారు. సాయంకాలం నాలుగూ నాలుగున్నర అవు తుంది. నేను లోపలికి రాగూడదు. ఆయన మంచంమీద కూర్చుని ఏదో మాట్లాడు తున్నారు. ఇంతలో నాన్న వచ్చాడు. ఆయనతో కబుర్లు చెబుతూ కూర్చున్నాడు. వరం అక్కయ్యకూడా అదే టయింకి వచ్చింది. మీ బావగారిని చూస్తూనే వెళ్ళిపోబోతుంటే నాన్నే "దావే! వరం!" అంటూ పిలిచాడు. కాస్సేపు కబుర్లయ్యాయి.

"యీ వేళ్టికి మీ పిన్నమ్మకి సాయం చెయ్యవే! రాత్రి ఇక్కడే పడుకుందువుగాని... ! బావకూడా వచ్చాడా! వంటంతా చెయ్యలేదు. .."

"అలాగే చిన్నాన్నా కానీ.. ." అందది.

"మీ యింటికి కవురెడతాన్లే!" అన్నాడు నాన్న బయటకి వెళ్తూ. వరం వంట యింట్లోకి వెళ్ళింది. మీ బావగారు బట్టలు మార్చుకుని పుస్తకం పట్టుకుకూర్చున్నారు. నేను పెరట్లో నించుని జాంకాయలు ముగ్గాయేమో చూస్తూ న్నాను.

"చీకట్లో యిక్కడ దేవుళ్ళాడుతున్నా




వెందుకే?" అంటూ నాన్న వచ్చాడు. నేనేదో చెప్పాను

"సర్లేగానీ ఓ మాట" అన్నాడు.

ఏంటా అన్నట్టు చూసాను.

"మన వరం వుంది చూసావా! దానికీ పాతికా నిండినట్టున్నాయి'"

"అవును!"

"ఓ చెంప నెరిసిపోతూనే వుంది పాపం' దాని బాబా' పాపం పెళ్ళి చెయ్యలేకపోతున్నాడు. తలుచుకొంటుంటే మన వంశం గౌరవం ఏమయిపోతుందా అని భయం వేస్తోంది కోర్కెలు తీరాల్సిన వయసులో పెళ్ళిళ్ళు కాక అడ్డమైనవాళ్ళతోనూ సంబంధాలు పెట్టుకొని యింటిల్లిపాదికీ తలవంపులు తెచ్చే ఆడపిల్లల కథలు ఎన్ని వినటంలేదూ! పాపం'"

అమోమయంగా చూస్తున్నాను.

"అందుకని మనం దానిని దయదలచాలి" అన్నాడు నాన్న.

"??"

"మన కులగౌరవం కోసం సాటి ఆడదానికోసం నువ్వీ త్యాగం చెయ్యాలమ్మా' ఇందులో తప్పుకూడా ఏమీలేదు! పూర్వం వ్యాసమహాముని లాంటి వారే వీటిని సమ్మతించారు "

"నాకేం అర్థంకావటం లేదు నాన్నా?"

"మరేం లేదమ్మా! మీ ఆయనా వరం కలుసుకొనేటట్టు చెయ్యాలి. వంశ గౌరవం నిలుస్తుంది. యీ మాత్రం త్యాగం చెయ్యటం వల్ల వరం కోర్కెలు తీరతాయి! ఎటునుంచి ఎటొచ్చి ఏం జరిగినా మందో మాకో చూట్టానికి మనం వుండనే వున్నాం! ఇంట్లో ఇంట్లో విషయం కనక బయటకు పొక్కదు

నాన్న మాటలు మొదట్లో నాకు రుచించలేదు. కానీ నా త్యాగంవల్ల ఎంతమంది జీవితాలు రక్షించబడతాయో నాన్న వివరంగా చెప్తుంటే వరంమీద జాలేసింది! నాకన్న పదేళ్ళు పెద్దది తను! పాపం? అనుకున్నాను.

ఆ రాత్రి వాళ్ళిద్దరికీ మంచాలు ఒకచోటే చేయించాడు నాన్న. నేను చాపమీద పడుకున్నాను మండువాలో. అర్ధరాత్రి బావ నన్ను లేపారు. ఆయనకి నిద్రపట్టటం లేదుట! నాన్న చెప్పిన మాటలు గుర్తొస్తున్నాయి. ఆయన మరో స్త్రీ పట్ల దృష్టి వుండే మనిషి కాదు. నేను యిక్కడకు వచ్చి నెల దాటిపోయింది "ఎందువల్ల?" అన్నాను అమాయకంగా మొహంపెట్టి. "నువ్వెప్పుడూ యింతే "

మారాంగా అన్నారు.

నాన్న గుర్తొస్తున్నాడు. ఆయన చెయ్యమన్న త్యాగం గుర్తొస్తోంది. గొంతు పెకల్చుకొని అన్నాను.

"ఫరవాలేదు. వరం వుందిగా?"

"వచ్చు! తప్పు! వెధవ్వేళాకోళం!" అన్నారు.

"పాపం! దానికీ పాతిక ఏళ్ళు వచ్చాయండీ! అదిమాత్రం ఉప్పూ పులుసూ తింటంలేదూ?"

"నోర్ముయ్!" అంటూ వెళ్ళిపోయారు.

వరంకూడా గొడవపెట్టలేదు! పాపం! అది మాత్రం మనిషికాదూ!"

లలిత గొంతులో త్యాగం చేసానన్న ఫీలింగు బలంగా వుంది.

యీ జరిగిన సంఘటన యింత వివరంగా అది చెప్పలేకపోయినా జరిగినదిదే అని వూహించగలిగాను.

నేనేం మాట్లాడకపోవటంతో దానికి ఏదో భయం కలిగినట్టుంది. ప్రపంచం గురించీ మనుషుల అంతర్గత స్వభావాల గురించీ అర్థం చేసుకోటానికి తగిన వయసుకూడా దానికి లేదు. పధ్నాలుగేళ్ళ వయసులో యీ దేశంలో ఆడపిల్లలు పెళ్ళిళ్ళు చేసుకొని పిల్లలనుకూడా కనేస్తున్నారు గాని ఏ విషయాన్నయినా లోతుగా ఆలోచించే స్థాయికి ఎదుగుతున్నారా? అందుకే వాళ్ళను త్యాగాలూ, ప్రేమలూ, కన్నీళ్ళూ, కష్టాలూ ఆకర్షించినంత బలంగా మరేవీ ఆకర్షించలేవేమో!

"నేనేమయినా తప్పు చేసానా అన్నయ్యా!"

భయం నిండిన దాని గొంతుక నా ఆవేశాన్ని అణిచేసింది.

"సర్లే వెళ్ళు." విసుగ్గా అన్నాను.

అది వెళ్ళలేదు కొంచెంసేపు తటపటాయిస్తూ అంది.

"నాకేంటో భయంగా వుందిరా ! దాని పిచ్చిలోనే ఆయన పడిపోతే నా కాపురం ఏమవుతుంది? నేను వయసులో చిన్నదాన్నిట! దానికన్నా బావుంటానుట! అందువల్ల బావ నన్ను వదల్లేడుట! నాన్న మాటలు నిజమే నంటావా?"

ఈ ఆలోచనలన్నీ ముందేమయినాయి?— అన్న ముక్క నోటి చివరివరకూ వచ్చింది. కాని అనలేదు.

అది వెళ్ళిపోయింది

దానికీ భయంగానూ బెంగగానూ వుంది. బావ సరేసరి! క్షణికమైన కోరికలో సాహసించాడే కాని చేసింది తప్పేనని ప్రశ్చాత్తాప పడుతున్నాడు! యింక వరం? అది మాత్రం ఎట్లా సంతోషపడగలదు?

యిది కథలలో తప్ప జీవితంలో ఊహించలేని సమస్య. దీని కంతటికీ ప్రోత్సాహమిచ్చిన నాన్న మనసులో వున్నదేంటి? వరం పరిస్థితి పట్ల కేవలం జాలే వున్నదా? అందుకు యిదే మార్గం అనుకున్నాడా? పల్లెటూళ్ళలో యిటువంటి సంబంధాలను ప్రోత్సాహించటమనే పద్ధతి పూర్వం నుంచీ వున్నదేనా? నా పట్నవాసం చదువులో ఉద్యోగంలో జీవనవేగంలో యీ పల్లెటూరి బ్రతుకులో నిగూఢమయివున్న యిలాంటి రహస్యాలు నా చెవులలో చేరలేదా? కాక మరేదయినా కారణం వున్నదా? ఏమిటది? ఏమిటది?

పెరట్లో మంచంమీద — అలాగే పడుకున్నాను. ఆకాశం మీదకు లగ్నం చేసిన చూపుల చుట్టూ చీకట్లు క్రమ్ముకొన్నాయి. తల నాదుగా వుంది.

"బాబీ! బాబీ!"

నన్నెవరో లేపుతున్నారు. కళ్ళు తెరిచాను


నాన్న! బుగ్గమీసాలతో వున్న ఆ ముఖంలో కనిపిస్తున్న ఆదుర్దా నాకు ఆ సమయంలో ఒక మహానటుడి మహోన్నత నటనలా కనిపించింది. భుజం పట్టుకుని కదుపుతున్నాడు.

లేచి కూర్చున్నాను.

"ఒంట్లో బావులేదా ?"

"అబ్బే! బానే వుందే!" అంటూ నించున్నాను. దూరాన లలిత నించుని వుంది. అది భయపడుతున్నట్లు తెలుస్తూనే వుంది.

## (వి)చిత్రం విజ్ఞానం



పోలీసు కుక్కల (ఘ్రాణ) శక్తి మన ఊహా కందని మేరలో వుంటుంది. దొంగ ముట్టుకున్న వస్తువులమీదా, అతడు కాలు మోపిన ప్రదేశాల మీద, అతడు విసర్జించిన కొవ్వు ఆమ్లములు వుంటాయి. మనిషి మనిషికీ యీ కొవ్వు ఆమ్లములలో తేడా వుంది. ఈ ఆమ్లముల వాసనను పసిగట్టి పోలీసు కుక్కలు దొంగలను పట్టుకుంటాయి. పోలీసుకుక్క (ఘ్రాణ) శక్తికి సమంగా మనిషి (ఘ్రాణ) శక్తి పెరగాలంటే- అది సుమారు పదిలక్షల రెట్లు పెరగాల్సి వుంటుంది!!

"పదపద! మంచు కురుస్తోంది! లలితా! మంచం లోపల పెట్టించు!"

నాన్న గొంతు వెనకనించి వినిపిస్తోంది.

తండ్రి చెప్పిన మాటకోసం భర్త అయిన శ్రీకృష్ణ దేవరాయలను చంపడానికి సిద్ధపడిన స్త్రీలు పుట్టిన గడ్డ యిది. మనసు ఆలోచిస్తూనే వుంది.

భోజనాలు పూర్తయ్యాయి.

ఒంతసేపూ నాన్నే మాట్లాడుతున్నాడు లలితా బావా అదోమాదిరిగా వున్నారు అమ్మ పాత్ర అర్థమే కాలేదు నాకు

"తోటవైపు వెళ్దామా? కాపలా సరిగ్గా వుందో లేదో చూడొచ్చు" అన్నాను. నాన్న దుప్పటీ కప్పుకుని కర్ర తీసుకొని బయల్దేరాడు.

మామిడి తోట గురించి దాన్ని కొట్టించి వ్యవసాయం పెట్టడం గూర్చి చెప్తున్నాడు' మాకోసం ఒట్టి గడ్డితో కూర్చోటానికి తయారు చేసాడు సూరయ్య. వెచ్చగా వుంది గడ్డి. వాళ్ళిద్దరూ వ్యవసాయం.గూర్చి చెప్పుకుంటు న్నారు. మామిటి చెట్లు పూతపట్టేక పూత నిలవటానికి ఏవో మందులు వచ్చాయంటు న్నారు. నాన్న ఓసారి అంతా పర్యవేక్షించి వచ్చాడు. ఆయన కూర్చోగానే అన్నాను.

"వరమూ బావ గురించీ నీకు తెలుసా?"

"ఊ!" అన్నాడు నవ్వుతూ.

"నీ వుద్దేశ్యం ఏమిటి?" సూటిగా అడిగాను.

"ఏముంది? పాపం! వరం మాత్రం మనిషి కాదా!"

"నీకు జాలేనా? మరేదయినా వుందా ?"

"అంటే ?"

"అంటే నీ అన్నగారిమీద కక్ష! రాజకీయంలో తిరిగి ముందుకు రాకుండా ఆయనను చావు దెబ్బ కొట్టడం! ఏడిపించటం!"

"మూర్తీ !!'

నా గొంతుక ఆగిపోయింది.

"నేను వాడికి తమ్ముణ్ణిరా! ఒకే కడుపున పుట్టిన అన్నదములంరా!"

నా తెలివితేటలు ఆయనని అంచనా వెయ్య లేకపోతున్నాయి.

"—నాకు బుద్ధి లేదనుకుంటున్నావా?"

"బుద్ధుండే తప్పు చేయిస్తున్నావా ?"

"తప్పు ! నువ్వు తప్పంటున్నదేమిటి?"


"వాళ్ళ అక్రమ సంబంధం "

"అక్రమ సంబంధాలన్నీ తప్పులవుతాయా? వాటిని 'తప్పు' అనే భావం నీకు చుట్టూ వున్న మనుషులనుంచి సంక్రమించంది. నీకు గురువు చెలం కదా! యిలా మాట్లాడతావేంటి?"

ఆయన అపహాసిస్తున్నాడా?

"చలం కోరేది స్వేచ్ఛ! నిర్బంధం కాదు." అన్నాను.

"అవునా! నేనిచ్చిందీ స్వేచ్ఛే' ఎవరినీ నేను నిర్బంధించలేదు."




"నువ్వు వరాన్ని నిర్బంధించావు। బావను నిర్బంధించావు. వాళ్ళలో లేని ఉద్దేశ్యాన్ని పరిస్థితులతో కల్పించావు. ఆమెలో నిద్రపోతున్న వాంఛలను రేపి నీ స్వలాభానికి కక్షకీ ఉపయోగించుకున్నావు".

యీసారి నాన్న ఉద్రేకపడలేదు.

"నేను నా కూతురి జీవితం పాడుచేస్తానా? అయినా దాని జీవితం ఏమవుతుంది? నేను రక్షణగా వున్నానుకదా।"

"మాట మార్చకు। స్వేచ్ఛగురించీ నిర్బంధం గూర్చీ మాట్లాడు। వరం బ్రతుకు పాడవుతుందా లేదా అన్నది వేరే ప్రశ్న. అది పూర్తిగా వేరే విషయం । నా దృష్టిలో అసమర్థులకు తప్ప . బ్రతుకు పాడవటమన్నదే లేదు"

"అవునా। నేనూ అంగీకరిస్తున్నాను। బ్రతుకు పాడవటమన్నదే లేనపుడు యింక కొన్ని క్షణాల లైంగిక సంయోగంవల్ల ఒరిగే నష్టమేముంటుంది ?"

అతడు నన్ను మాట్లాడనిస్తున్నాడు. తన వాదనకి సరిపోయే మాట నా నోట దొర్లగానే దానికి వేరే అర్థాలు తీస్తున్నాడు।


"నే నన్నది పూర్తిగా వినలేనట్టుంది. బ్రతుకు పాడవటం సర్వనాశనం కావటంవటం వంటి వన్నీ వ్యక్తుల మానసిక స్థయిర్యానికి సంబంధించిన అంశాలు. నువ్వు వరం వయసునీ, లలిత శైశవాన్నీ, బావ వాంఛనీ ఉపయోగించుకుని నీ అన్నమీద దెబ్బ తీయటానిక్కి ప్రయత్నించావు దానికి ఏ కడుపయినా వస్తే తల ఎత్తుకోలేగదుదా నలుగురిలోకి రాలేడుగదా—అని భావించావు।"

నాన్న కదల్లేదు.

"యిందులో చేయరానిదేదో చేసినట్లు అనవసరంగా ఊహించుకుంటున్నావు గానీ నన్ను సంస్కర్తగా ఎందుకు అనుకోవు? బాల్య వివాహాలని నిరోధించటం విధవా వివాహాలను ప్రోత్సహించటం ఒకప్పటి సంఘం— అవసరాలు। ఎందరో కన్నెలుగానే జీవితాలు ముగించివెయ్యటమో ఏ అలగావాడితోనో లేచిపోయి సానికొంపల పాలయి పురుగులు పట్టి రోడ్లపక్క అనాథల్లా మరణించటమో యీనాటి దుస్థితి। యీ పరిస్థితినుంచి బయటపడటానికి నేనొక అడుగువెయ్యటం ముందడుగే అవుతుంది నేను సంస్కర్తనే అవుతాను "

"సం స్క ర్త।" గుండెలో పేరుకొం

## (వి)చిత్ర విజ్ఞానం



సిఫిలిస్, గొనోరియా అనబడే సుఖవ్యాధులు ప్రపంచమంతటా దినదిన ప్రవర్థమానమౌతున్నాయి. 1975 వ సంవత్సరం వరకు అమెరికాలో మాత్రం సుమారు 30 లక్షల మంది ఈ వ్యాధులకు గురైనారని, డగ్లస్ కాలిగన్, SCIENCE DIGEST పత్రికలో పేర్కొన్నాడు. బంతి ఆకారంలో వున్న క్రిమి "గోనోకాకల్" క్రిమి. వెంటనే తగినమందులు వాడకపోతే ఇది స్త్రీ పురుషుల్లో వంధ్యత్వమును (sterility) కలిగిస్తుంది. మెలికలు తిరిగి తీగలా వున్న క్రిమి "సిఫిలిస్" క్రిమి. ఇది అత్యంత ప్రమాదకరమైనది.

---

టున్న అసహ్యం గొంతులో నిండింది.

"ముంద డుగు" అంటూ నన్ను, నేను సంబాళించుకున్నాక —

"సంస్కర్త అంటే నీకు అర్థంకూడా తెలీదు"

కొంచెంసేపు ఊరుకొని "చలంని చదివావు కదా నువ్వు అర్థంచేసుకొన్నదేంటి?"

"నీ వడిగేదీ అనదల్చుకున్నదీ నాకు పూరాగా తెల్సు. చలం లైంగిక స్వేచ్ఛ వుండాలన్నాడంటావు"

"అదే అనుకున్నాను. వరానికి అవసరమైన దాన్ని సమకూర్చాను"

ఆయన దృఢత్వం కొద్దిగా బీటలువారింది.

ఉద్రేకంతో అందుకున్నాను

"చూడు నాన్నా! ఒక్క విషయం అడుగుతాను. జాగ్రత్తగా విను. బాగా ఆలోచించు. వరాన్ని నీ ఆదర్శాలకీ సంస్కరణకీ ఎన్నుకున్నానంటున్నావు. బాగుంది. నువ్వు వరానికి యీ సూత్రాలగురించీ లైంగిక స్వేచ్ఛగురించీ వివరించావోలేదో ఆమెను అంగీకరింపజేసావో లేదో నేను అడగటం లేదు : చెల్లాయి లలిత వుంది. అది "స్త్రీ" అని చెప్పే అవయవాలు దానికి వున్నాయి. నేను "పురుషుడి" నని చెప్పే శరీర నిర్మాణం నాకు వుంది. దానికి యింకో పదేళ్ళదాకా పెళ్ళవకపోతే పాపం! అదీ వరంలాగే బాధపడుతుంది. అందువల్ల 'యింట్లో యింట్లోగనక తెలియదు. ఏదయినా జరిగితే మందో మాకో యివ్వటానికి నేను న్నానూ : నేను ముసిలాణ్ణి కనక, అన్నకీ చెల్లికీ కలిపేస్తే సరిపోతుంది' అనుకుని"

ఆగాను.

ఒక్కొక్కమాటా ఆయన శరీరంలోని అణువణువులోని రక్తాన్ని పీల్చివేస్తుంటే మొహం తెల్లనయిపోతున్నట్లుంది ఆయన వజ వజా వణుకుతున్నాడు.

"నువ్వు అంగీకరిస్తానని చెప్పు నాన్నా. నీకు రెండు చేతులూ ఎత్తి మొక్కుతాను. ఈ మాటలు మాట్లాడినందుకు, యిలాంటి ఊహ చేసినందుకూ, యీ నా ధైర్యానికీ రేపే నువ్వు చెల్లాయితో చెపుతావు నాతో ఏకాంతంగా వుండవద్దనీ, ఒకే మంచంమీద కూర్చోవద్దనీ."

మళ్ళీ అందుకున్నాను.

"అది వేరూ యిది వేరూ అంటావు బహుశా! కాని, దానికి జవాబు నా దగ్గరుంది. సంయోగానికి అవసరమయినవి శరీరాంగాలే కాదు. మనసుకూడా ముఖ్యం : లలితకి నేను అన్ననసీ, నాకు అది చెల్లెలనీ అన్నాచెల్లెళ్ళు కలియరాదనీ పుట్టిన దగ్గరనుంచీ మా రక్తంతో పుట్టి పెరిగిన భావం. ఆ భావాన్ని చంపి తామభావాన కలిగించటానికి కొంత ప్రయత్నం అవసరం! వరాన్నీ బావనీ కలపటానికి నీవు చేసిన ప్రయత్నాలకీ .. నన్నూ

చెల్లాయినీ కలపటానిక్కి చేయాల్సిన ప్రయత్నా లకీ రూపంలో భేదం ఏమాత్రం లేదు! కాదంటే నీవు మరింత బలమయిన పరిస్థితులను సృష్టించాల్సి ఉంటుంది! ఏం! చెప్పు! అటువంటి భావం మామధ్య నువ్వు కలిగించగలవా? అందుకు యత్నించగలవా? "

నాన్న చేతిలో తురుఫాసు లేదు. ఆయన పడుతున్న బాధకు నిదర్శనంగా పెదాలు వణుకుతున్నాయి. ఎలాంటి స్థితిలోనూ నేలరాలని ఆయన నోట్లో చుట్ట నేల రాలింది. ఆయనలోనున్న అధర్మం నామీద ఉద్రేకపడకుండా చేసి వేసినట్లుంది. దొరికిపోయిన దొంగలా వున్నాడు.

"ఉహుం! నువ్వు జవాబివ్వలేవు నాన్నా! వాళ్ళ యిద్దరికీ మనసుల్లో కోర్కె వుండి, ఆ కోరిక తీర్చుకోనూ లేక అణుచుకోనూ లేక సతమత మవుతుంటే యిద్దరికీ లైంగిక స్వేచ్ఛ గూర్చి చెప్పి, వాళ్ళే ఒక నిశ్చయం తీసుకునేటందుకు తగిన మనోధైర్యం కల్పించటం ఒక విషయం! బావ ఎలాంటివాడో నాకు బాగా తెలుసు. మగవాడికి సైతం శీలం అవసరమన్న అభిప్రాయం గల వాడు. అంత బలమయిన అభిప్రాయం వున్నప్పుడు ఎందుకు లొంగిపోవాలంటావు? మనుషులకి అభిప్రాయాలు నిలబెట్టుకొనే దృఢత్వం లేనంతమాత్రాన అభిప్రాయాలే వుండరాదనటం అక్రమం! అతని అభిప్రాయాలను మార్చే ప్రయత్నం ఎందుకు చెయ్యాలి? నీ ప్రయత్నాలకు చలం భావాలను అప్పయిచేసి నాతో వాదిస్తున్నావా! నేను లైంగిక నియమాలను అంగీకరించను. అంత మాత్రంచేత, ఆ నియమాలను తలదాల్చేవారిని నేను కొట్టి పారెయ్యను. మనసులో కోర్కెలుంచుకుని బరిదాటలేని అమాయకులనిగూర్చి జాలిపడటంలో అర్థం వుంది. లోకానికి భయపడి 'తప్పుడు పనులు' అనబడేవాటిని దొడ్డిదోవల్లో చేయటాన్నీ అందులో వుంటే పురుషుడి మోసాన్నీ—'తప్పు' అని ఖండించటం వల్ల ప్రయోజనం వుంది. సెక్సు సంబంధాలు వ్యక్తులకు పరిమితమయినవి కావు! అవి సాంఘిక గమనంతో బలంగా ముడిపడి వున్నాయనీ విశ్వసించేవారిని, వారు ఊహించుకునే వున్నత పథంనుంచి క్రిందకి యీడ్చి వాళ్ళకు లైంగిక స్వేచ్ఛ నిచ్చానని కబుర్లు చెపుతూ 'సంస్కర్త'నని వాదించటంలో ప్రయోజనం లేదు సరికదా నీ దుష్టబుద్ధే వుంది.

నాన్నా! తండ్రితో యిలా కొడుకు మాట్లాడే పరిస్థితిని నీ చేతులతో నీవే తెచ్చుకున్నావు. యిప్పటికయినా నీ అన్నగారిమీద కక్ష తీర్చుకోటం కోసం వరంలాంటి అమాయకురాలి కోర్కెలను వాడుకోకు! యింకా నయం, నీ మనసులో నున్న 'జాలి'తో నీ అన్న కూతురి వాంఛలకోసం—చలం కథలోలా — నువ్వే సిద్ధం కాలేదు!

ఒకవేళ ఆ ఉద్దేశంకూడా నీకు వున్నదేమో! అందుకు యిది ఒక ప్రయత్నమేమో!!" ఆవేశాన్ని అణుచుకోటానిక్కి కాసేపు ఆగాను.

"నీకు నిజంగా జాలే వుండివుంటే దాని వివాహానికి అవసరమైన డబ్బు యిచ్చివుండేవాడివి గాని యింత వికృతంగా ప్రవర్తించి వుండేవాడివి కాదు. నిన్ను తండ్రిగా అంగీకరించాలంటేనే అసహ్యం కలుగుతోంది "

ఆయనని అక్కడే వదిలేసి ఇంటిమొహం పట్టాను. ఆయన పట్ల ఏవగింపుతో నిలువెల్లా నిండిపోయింది.

'జరిగిన దాని' గూర్చి యింత బాధపడే నాలో 'జరగవలసిన' దేమిటన్న ప్రశ్న అప్పుడప్పుడు మెదుల్తోంది.

ఆ రాత్రి నిద్రపోలేకపోయాను.

వరం నా కళ్ళముందు మెదుల్తోంది. ఆమె మనస్ఫూర్తిగా అంగీకరిస్తే పరిస్థితి వేరు. యిక్కడ కోర్కెలు తీర్చుకుంటూ యింటికి పోయి తనుచేసే పనికి తనను తను నిందించుకుంటూ కుమిలిపోతున్నట్లయితే ఆ పరిస్థితి వేరు. వరంమీద జాలితో నా గుండె నిండిపోయింది.

మర్నాడు వరాన్ని మా తోటలోకి తీసుకుపోయాను దాన్ని ఓదార్చాలి, దానికి బ్రతుకు పట్ల ధైర్యమివ్వాలి అన్న నిశ్చయంతో.

"చూడు వరం!"

వరం తన విశాలమయిన కళ్ళను ఎత్తి నేల మీంచి నా వయిపు దృష్టి మరల్చలేదు. దాని 'రహస్యం' నాకు తప్ప మరెవరికీ తెలియదన్నట్లు భయపడిపోతోంది.

"సిగ్గుపడకు వరం! నువ్వు చేసినది తప్పు కానేకాదు "

ఒక్కమారుగా వరం నన్ను కౌగలించుకొని ఏడవటం ప్రారంభించింది. అంతలోనే పక్కనున్న రాతిమీద తల కొట్టుకోటానికి ప్రయత్నించింది. అందునించి ఆమెనుంచి అపుతుంటే ఆమె పిచ్చి ఆవేశానికి బలానికి నాకే ఆశ్చర్యం వేసింది. వీపుమీద రాస్తూ కూర్చున్నాను.

ఆమె ఏడుపు సన్నగిల్లాక అన్నాను.

"బాధపడకు! విషయంలోకి వద్దాం!"

"యింకేం విషయం? నా బ్రతుకు నాశనమయిపోయింది. ఒళ్ళూ పయీ తెలీకుండా ప్రవర్తించాను. నన్నెవరయినా పెళ్ళాడుతారా? పెళ్ళాడినా యీ విషయం దాచుకొని యీ అపవిత్ర దేహంతో కాపురం చెయ్యగలనా? నేను బ్రతకటం అనవసరం " నిరాశే నిండిన గొంతు!

మనిషికి ఆలోచన, స్వవిమర్శ ఆత్మీయుల పరామర్శనుంచే వస్తాయిట!

రాత్రంతా చేసుకున్న రిహేర్సల్స్ గుర్తు చేసుకుంటూ ఆరంభించాను.

యిదేమంత ఘోర నేరం కాదన్నాను. యిలాంటివి చాలామంది జీవితాల్లో సామాన్యమయిన విషయాలే అన్నాను. ఎవరూ దీనికి అనవసర ప్రాధాన్యత యివ్వరాదన్నాను. ఎవరి బ్రతుకును వారే నిర్ణయించుకోవాలనీ, బ్రతుకును నిందించుకోటంలోనూ . అది వద్దనుకోటంలోనూ క్షమించరాని మూర్ఖత్వమున్నదనీ, ధైర్యంగా ఎవరి సమస్యలను వారే పరిష్కరించుకోవాలనీ! సమస్యలు వచ్చినపుడే గుండె నిబ్బరం అవసరమనీ; 'తప్పు' అనుకుంటున్నది చేయటంకన్న దాన్నుంచి బయటకు రావడమే గొప్పతనమనీ చాలా చెప్పాను. చాలా సేపు చెప్పాను. చాలా మాటలు ప్రయోగిస్తూ చెప్పాను. ఆమెకు ఓదార్పు; ధైర్యం, ఆలోచన వంటివి యివ్వటానికి యత్నించాను.

నా మాటలు నాకు తృప్తి కలిగించాయికాని ఆమెలో చలనం కలిగించలేదని చిన్న అనుమానం వచ్చింది. నేను మాట్లాడుతూనే వున్నాను. ఆమె వింటూనే వుంది.

"వస్తానురా!" అంటూ వెళ్ళిపోయింది.

వరం వెళ్ళిపోడంలో, ఆ నడకలో, ఆ కనులలో ఏదో బలమైన నిర్ణయం; అటూ ఇటూ ఊగే మనసూ రెండూ నాకు స్పష్టంగానే కనుపించాయి.

ఆమె నిర్ణయం ఏమిటో నా ఊహకు అందలేదు.

మరోమారు వెనక్కి పిలిచి మాట్లాడాలి అనుకున్నాను. ఇంతకన్న ఏం మాట్లాడతాను? ఏం చెయ్యగలుగుతాను? అందుకే పూరుకొన్నాను.

మర్నాటి ఉదయానికి ఆమె నిర్ణయమేమిటో ప్రపంచమంతటితోబాటు నాకూ తెల్సిపోయింది.

పిచ్చివాడిలా పరుగెత్తాను.

ఆత్మీయుల రోదనలమధ్య విరగగొట్టబడిన తలుపుల మధ్య గది మధ్య నేలమీద పడుంది వరం! ఆమె కక్కిన రక్తం ఆమె తాగిన ఎండ్రిన్ డబ్బా రాత్రంతా ఆమెబడిన నరక యాతనను విప్పి చెపుతున్నాయి. అందమయిన వరం భయానకమయిన చావును వరంగా పొందింది.

అయితే ఆమె చావుకు కారణం ఆమె పిరికితనమా? నేనామెకు ధైర్యాన్ని కలిగించలేకపోవటమా?

ఆమె ప్రశ్నలనూ నా జవాబునూ పదేపదే గుర్తు చేసుకొన్నాను. నా కళ్ళముందున్న పొరలు కొద్దిగా తొలగుతున్నాయి.

ఒకరిమీద కక్ష తీర్చుకోటం కోసం 'సెంటిమెంట్స్'ను నా తండ్రి తెగ నరుక్కున్నంత సులువుగా—ఒకరిని రక్షించటంకోసం నేను తెగ నరుక్కోలేక పోయానన్న విషయం నా గుండెలో శల్యంలా నాటుకుంది !

ఆచరణకూ ఆలోచనకూ ఎంతదూరం!!! □